# ఈకాలానికి ఇమడని మనిషి

హైదరాబాద్ నగరంలో తెలంగాణా ఉద్యమమం తారస్థాయిలో జరుగుతోంది. విద్యార్థుల సమస్యలపై నిరాహార దీక్షతో ప్రారంభమైన ఆ ఉద్యమాన్ని రాజకీయ నాయకులు తమ చేతుల్లో తీసుకుని చేతలు రూపొందిస్తున్నారు. అంగబలాన్ని విద్యార్థులూ, పనీపాటాలేనివాళ్ళూ సమకూరుస్తూంటే అర్థబలాన్ని, అధికార బలాన్ని వారు అందివ్వసాగారు. దాంతో ఉద్యమం గొప్ప ఊపందుకొంది.

ఏరోజున ఏ బస్‌మీద రాళ్లుపడ్తాయో లేదా పెట్రోల్ పోసి తగబెడ్తారో ఎవరికీ తెలీదు. రాళ్ళ దెబ్బలకి కిటికీ అద్దాలు పగిలీ రేకులు సొట్టలు పడ్తుంటే బాడీషేప్ అష్టావక్రకుబ్జలా మారిపోతుంటే గాజుముక్కలు గుచ్చుకునీ, రాళ్ళదెబ్బలు తగిలీ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు విధిలేక బస్ ప్రయాణం చేసే పౌరులు.

ఇదంతా పగటిపూట జరుగుతున్న వీధి నాటకం. రాత్రిపూట జరిగే భాగవతాలు వేరే వున్నాయి. ప్రభుత్వం ఉద్యమాన్ని అణిచివేయడానికి శతథా ప్రయత్నిస్తూ ఉద్యమకారుల వ్యూహాల్ని వమ్ము చేయాలని చూస్తుంటే, ఏలాగైనా దానిని విజయవంతం చేయాలన్న పట్టుదల ఆందోళనకారులలో ఎక్కువవుతోంది.

ఆ రోజు ఉద్యమకారులు సమావేశమై, ప్రభుత్వ పథకాలను దెబ్బకొట్టడానికి గుట్టు చప్పుడుకాకుండా రాత్రిపూట కొన్ని వాహనాలను తగలపెట్టాలనుకున్నారు. అందుకు ఆనాటి బలిపశువుగా అక్కడికి సమీపంలో వున్న మెయిల్ మోటార్ సర్వీస్ ఆఫీస్ కాంపౌండులో వుండే మొబైల్ పోస్టాఫీస్ వ్యాన్‌ను తగలపెట్టాలనుకున్నారు.

అర్థరాత్రి రెండుగంటల ప్రాంతంలో ఉద్యమకారులు గోడదాటి నెమ్మదిగా ఆ ఆఫీస్ కాంపౌండ్‌లోకి ప్రవేశించారు. ఏదైనా అలికిడి వినవస్తుందేమోనని అన్నివైపులా చూశారు. ఎందుకోగాని ఆ సమయంలో గూర్ఖారాంసింగ్ అక్కడ లేడు.

అతను రాత్రి కాపలాదారు.

ఒక విద్యార్థి తనతో తెచ్చిన పెట్రోల్‌ని కొంత వాన్ టైర్లమీదా, బాడీ మీదా, లోపలా జల్లాడు. మరొక విద్యార్థి జాగ్రత్తగా అగ్గిపుల్ల గీసి అడుగునుంచి టైరుకి అంటించాడు. ఈ కర్మకాండ జరుగుతుండగా మిగిలిన విద్యార్థులు ఎవరైనా వస్తుంటే హెచ్చరించడానికి నలువైపులా చూస్తూ కాపలానుంచున్నారు. అగ్గిపుల్ల పడగానే భగ్గుమంటూ ఒక్కసారి వాన్ అంటుకుంది. అయితే ముందుటైర్లు అంటుకోవడంతో వెంటనే మంట బయటికి కనిపించలేదు. తలపెట్టిన కార్యం విజయవంతం కావడంతో వచ్చిన ఆందోళనకారులు చల్లగా బయటకి జారుకున్నారు.

మరో ఐదు నిమిషాలలో మంటలు ఉధృతంగా వ్యాపించాయి. అవి గోడలపైనుంచి స్పష్టంగా

బయటకి కనిపించ సాగాయి. దూరాన్నించి ఆ దీపావళి ముచ్చటను చూస్తూ తాము చేసిన ఘనకార్యానికి మురిసిపోసాగారు ఆ విద్యార్థులు.

చౌకీదార్ రాంసింగ్ తన డ్యూటీని ఎంతో శ్రద్ధగా చేస్తాడు. ఎంతో అప్రమత్తంగా కాపలా కాస్తుంటాడు. ఒక్క నిమిషం కూడా ఆఫీసు ప్రాంగణం విడిచి బయటకు వెళ్ళడు. క్షణంపాటు కూడా ఏమరడు. కాని దురదృష్టవశాత్తూ ఆ రోజు అతనికి విపరీతమైన మత్తుగా, బద్ధకంగా వుంటే దగ్గర్లోనే వున్న ఇరానీ హోటల్‌కి టీ త్రాగడానికి వెళ్లాడు. తెలిసి చేసినట్లు అతను లేని ఆ స్వల్పకాలంలోనే దురదృష్టవశాత్తూ ఇంతటి ఘోరం జరిగిపోయింది.

రాంసింగ్ హోటల్ నుండి బటయకు వస్తుండగానే ఆఫీస్ కాంపౌండ్‌లో మంటలు వ్యాపించాయి. అదురుతున్న గుండెలతో ఆరదాబాదరగా అటువైపు పరుగెత్తాడు. కంగారుగా తాళం తీసి లోపలికి పరుగెత్తికెళ్ళి చూస్తే కొత్తపెళ్ళికూతురులా వుండే ఆ వ్యాన్ చితిమీద మండుతున్నట్లు మండుతూ కనిపించింది.

ఆ దృశ్యం చూసి గుండెలు బాదుకుంటూ వెంటనే ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేశాడు రాంసింగ్. అర్థరాత్రి దాటిందేమో, జనసంచారం ఇంచుమించు లేకపోవడంతో ఆ దహనకాండని చూడడానికి ఎవరూ రాలేదు.

ఫైర్ స్టేషన్‌కి ఫోన్ చేసిన తర్వాత తన ఆఫీసర్ గారి ఇంటికి కూడా ఫోన్ చేశాడు రాంసింగ్. ఆ వార్త విని ఎంతో కంగారు పడ్డారాయన. ఐదు లక్షలపైన ఖరీదు చేసే ఆ వ్యాన్ తగలబడిందనగానే ఆయన గుండెలు గుభిల్లుమన్నాయి. తాను వెంటనే బయలుదేరి వస్తున్నాననీ అతనిని ఎక్కడికీ కదలొద్దనీ చెప్పాడు ఆయన.

మరొక ఇరవై నిమిషాలలో ఫైర్ ఇంజన్ వచ్చింది. ఈలోగా మండుతున్న వాన్‌మీద మట్టి జల్లీ, నీళ్ళు పోసి యథాశక్తి దానిని ఆర్పడానికి ప్రయత్నించ సాగాడు రాంసింగ్. ఫైర్ ఇంజన్ మంటల్ని ఆర్పుతుండగానే ఆఫీసర్ మస్తాన్‌రావు గారు వచ్చారు.

మండిపోతున్న ఆ వాన్‌ని చూసేసరికి ఆయన గుండె చెరువైంది.

ఒక అరగంటలో మంటలు పూర్తిగా ఆరాయి. కాలిపోయిన రబ్బరువాసన అక్కడి గాలినంతా నింపివేసింది. ఆ వాసనకి తోడు గాలి వేడికూడాను. ఫైర్‌సర్వీస్ వాళ్ళు తమ పని పూర్తికాగానే వెళ్ళిపోయారు.

ఆయనని వేగంగా అనుసరించాడు రాంసింగ్.

మస్తాన్‌రావు గారు వెంటనే పోలీస్‌స్టేషన్‌కి ఫోన్ చేసి జరిగిన విషయం రిపోర్టు ఇచ్చారు. ఫోన్ చేయడం అయ్యాక రాంసింగ్ ముఖంలోకి నిశితంగా చూశాడు.

ఆయన ముఖం వంక చూడలేకపోయాడు రాంసింగ్. చెయ్యకూడని తప్పు చేసినవాడిలాగా తలదించుకున్నాడు.

"రాంసింగ్. ఇదెలా జరిగింది?" అని అడిగాడు ఆయన.

"సాబ్ ..... నేనేం చెప్పను సార్. వాళ్లు దొంగచాటుగా గోడదూకి వచ్చి నిప్పుపెట్టారు" అన్నాడు రాంసింగ్.

"చౌకీదార్‌వి నువ్వుండగా వాళ్ళు ఎలా వచ్చారు?" అని గట్టిగా అడిగారు ఆయన.

"....సాబ్. ఎప్పుడూ లేనిది నాకు ఈరోజున నిద్ర ముంచుకు వచ్చింది. అందుకని చాయ్ త్రాగిరావడానికి బయటకు వెళ్ళాను. ఆ కొంచెం సేపట్లోనే ఇంతటి ఘోరం జరిగింది" ఆ మాటలు

అంటుంటే రాంసింగ్ గొంతు జీరబోయింది. వస్తున్న కన్నీటిని చేత్తో తుడుచుకున్నాడు.

...సరే, జాగ్రత్తగా కాపలా వుండు. నేను వెళ్ళొస్తాను" అంటూ లేచారు మస్తాన్‌రావుగారు. అప్పటికి మూడు గంటలు దాటింది.

"జీ హుజూర్" అంటూ మరేమీ అనలేక రెండు చేతులూ ఎత్తి దణ్ణం పెట్టాడు రాంసింగ్. కాలిపోయిన వ్యాన్ వంక మరోసారి చూసి తన స్కూటర్ ఎక్కి వెళ్ళిపోయాడు మస్తాన్‌రావు.

## 2

మర్నాడు పది గంటలకు మామూలుగా అందరూ ఆఫీసుకు వచ్చారు. అందరికంటే ముందే వచ్చాడు మస్తాన్‌రావు. మామూలుగా అయితే ఆఫీసుకి వచ్చేముందు సర్కిల్ ఆఫీసుకి వెళ్ళి పదిన్నరా, పదకొండు గంటలకు వస్తుంటాడాయన. అటువంటిది ఆ రోజు ఆయన అందరికంటే ముందు రావడంతో, తాము ఆలస్యంగా వచ్చామా లేదా తమ వాచీలు స్లో పోతున్నాయా అని కంగారుపడసాగారు స్టాఫ్ మెంబర్లు.

అయితే ఆఫీసుకి వచ్చిన కొద్ది నిమిషాలలోనే చావుకబురు చల్లగా తెలిసి, అస్థిపంజరంలా మిగిలిన ఆ వ్యాన్‌ని చూడడానికి వెళ్ళారు. రోజంతా ఆఫీసులో ఆ వ్యాన్ గురించి ఊరిలోని ఆందోళన గురించి చర్చే తప్ప ఎవరూ ఫైల్స్ విప్పలేదు.

వ్యాన్ తగలపడినందుకు ఎవరికీ అంతగా బాధ కలగలేదు. కాని ఆ కేసులో రాంసింగ్ ఇరుక్కున్నందుకు అందరికీ బాధ అనిపించింది. కాపలా ఉండాల్సిన వ్యక్తి కాపలా మాని బయటకు పోవడమంటే అది చాలా సీరియస్ నేరం. ఏమీ జరక్కపోతే ఏమీ ఫర్వాలేదు. కాని నేరం జరిగితే మాత్రం దానికి తీవ్రమైన శిక్ష తప్పదు. అయితే ఈ నేరాన్ని రాంసింగ్ తెలిసి చేసింది కాదు, కావాలని చేసిందీ కాదు. అయినా నేరం నేరమే.

అతను చాలా మంచివాడు. ఆనేరంతో వ్యక్తిగత సంబంధం ఉన్నవాడు కాదు. వట్టి సత్యకాలపు మనిషి. తన వినయ విధేయలతోనూ, సత్ప్రవర్తనతోనూ, ముక్కుసూటిగా తనపని చేసుకునే లక్షణంతోనూ అందరి మెప్పు అభిమానాలను పొందినవాడు. అందుకే అటువంటి వాడికి ఈ కష్టం రావడంతో అదరూ తమ మనిషికి వచ్చినట్లుగా బాధపడసాగారు.

కొంతసేపటికి వారి చర్చ రాంసింగ్‌ని ఎలాగైనా రక్షించాలనే అంశం మీదికి మళ్ళింది. ఆఫీస్ స్టాఫ్ యూనియన్ సెక్రటరీకి ఒక ఆలోచన వచ్చింది. 'రాంసింగ్ తాను బయటకు పోయానని చెప్పకూడదు. ఆందోళనకారులు వచ్చి తనమీద బలవంతానపడి కాళ్ళూ చేతులూ కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి అసహాయుణ్ణి చేసి ఆ తర్వాత వ్యాన్‌కి నిప్పు పెట్టారని అతను స్టేట్‌మెంట్ ఇయ్యాలి.

ఇది అబద్ధమని చెప్పేవాళ్ళు కాని, చెప్పాలనుకునేవాళ్ళు కాని ఎవరూ లేరు. అందువల్ల ఈవిధంగా చేస్తే, రాంసింగ్ మీదకి కేసు రాదు. అతనికి ఏ శిక్షా పడదు'.

ఈ ఆలోచన అందరికీ నచ్చింది. తమ రాంసింగ్‌కు రక్షించేందుకు ఒకదారి దొరికింది. అయితే ఇందుకు ఆఫీసరు గారు ఒప్పుకోవాలి.

ఆఫీసర్ మస్తాన్‌రావు గారు స్వతహాగా మంచి మనిషి. నీతీ, నిజాయితీ వున్నవాడు. ముక్కుకు సూటిగాపోతూ, రూల్స్‌ని పాటించేవాడే అయినా జాలీ దయా గలవాడు. రాంసింగ్ అంటే అభిమానం వున్నవాడు. అందరితో కలిసి మెలిసి చనువుగా వుంటాడు. అందువల్ల ఆయన్ని ఒప్పించడం కష్టం కాకపోవచ్చు.

ఉద్యోగులు ఇలా చర్చించుకుంటుండగానే, మస్తాన్‌రావుగారు స్టాఫ్ హాల్లోకి వచ్చారు. ఆయన

రాగానే అందరూ లేచి నుంచున్నారు. వారిని కూర్చోమని చెప్పి తాను కూడా ఒక కుర్చీలో కూర్చున్నాడాయన. రాత్రి జరిగిన సంఘటన గురించి చెప్పి, అందర్నీ అప్రమత్తంగా వుండాలని హెచ్చరించాడు.

ఇదే అదననుకుని సెక్రటరీ అందుకున్నాడు.

"సార్ మాదో చిన్న రిక్వెస్ట్" అంటూ.

ప్రశ్నార్థకంగా చూశారాయన.

"సార్. ఈ కేసులో రాంసింగ్ అన్యాయంగా ఇరుక్కున్నాడు. అతన్ని మీరే రక్షించాలి. జరిగింది జరిగినట్లు స్టేట్‌మెంట్ ఇస్తే అతన్ని రక్షించడం అసాధ్యం. అందువల్ల....." అంటూ నసిగాడు సెక్రటరీ.

"అందువల్ల?" అంటూ ప్రశ్నించాడు మస్తాన్‌రావు.

"ఏంలేదు. అతన్ని ఉద్యమకారులు కాళ్ళూ చేతులూ కట్టేసి అసహాయుణ్ణి చేసి, వ్యాన్ తగల పెట్టారని స్టేట్‌మెంట్ తీసుకుంటే అతనికి ఏ ప్రమాదం వుండదు. మీకూ తెలుసుగా రాంసింగ్ ఎంతటి మంచివాడో! అతన్ని రక్షించాలంటే ఇదొక్కటే మార్గం" అన్నాడు సెక్రటరీ.

మస్తాన్‌రావు మౌనంగా ఆలోచనలో పడ్డాడు.

"సెక్రటరీ చెప్పింది నిజమే. రాంసింగ్ చాలా ఉత్తముడు. ఏదో అనుకోకుండా చేసిన పొరపాటుకి అతనికి పెద్ద శిక్ష వేయడం అన్యాయం. వ్యాన్ ఎలాగూ తగలబడిపోనే పోయింది. ఎవరో చేసిన తప్పుకి ఈ అమాయకుడిని శిక్షించడం అన్యాయం. అతనిచేత అబద్ధం చెప్పించి రక్షించడమే మేలు" అని అనిపించింది ఆయనకి. బరువుగా నిట్టూర్చి -

"సరే కానీండి. అలానే చేద్దాం" అంటూ లేచాడు.

ఆఫీసర్ గారు అంత తేలిగ్గా తమ సలహా ఒప్పుకున్నందుకు ఉద్యోగులకి ఎంతో సంతోషం వేసింది. వారి మనసు తేలిక పడింది. అందరు ఆఫీసర్లూ ఇలానే వుంటే ఎంతో బాగుండును అనుకున్నారు.

## 3

"చూడు రాంసింగ్ మొన్న జరిగిన దానిలో నీ ప్రమేయం ఏమీ లేదని నాకు తెలుసు. నువ్వు నీ పరిస్థితుల్లో చేసినా నీ డ్యూటీ వదిలిపెట్టి వెళ్ళడం పెద్ద నేరం. అవునా?" అన్నారు మస్తాన్‌రావు గారు.

"అవును సాబ్. నేను చేసింది తప్పే" అన్నాడు రాంసింగ్ తలదించుకుని.

"నీ దగ్గర స్టేట్‌మెంటు తీసుకోవాలి. నువ్వు నీ స్టేట్‌మెంట్లో జరిగింది జరిగినట్లు రాస్తే నీకు పెద్ద శిక్ష తప్పదు" అన్నారాయన తిరిగి.

"తప్పు చేసినప్పుడు అనుభవించక తప్పుతుందా సాబ్?" అన్నాడు రాంసింగ్ నెమ్మదిగా వేదాంత ధోరణిలో.

"శిక్షంటే సామాన్యమైన శిక్షకాదు. నిన్ను డిస్మిస్ కూడా చేయవలసి రావచ్చు" అన్నాడు ఆయన మళ్ళీ.

"ఏదైనా తప్పదు" అన్నాడు రాంసింగ్ నిబ్బరంగా.

"నువ్వు కనక నీ స్టేట్‌మెంట్లో నిజం రాస్తే నిన్ను రక్షించడం నావల్ల కాదు. ఎవరివల్లా కూడా

కాదు. అందువల్ల ఆందోళనకారులు నీమీదపడి కాళ్ళూ చేతులు కట్టేసి వ్యాన్‌కి నిప్పు పెట్టారని రాయి. నీమీద ఏ కేసూ వుండదు. నీమీద చర్య తీసుకోవలసిన ఆఫీసర్ని నేనే ఇలా చెప్పడం నిజానికి చాలా తప్పు. కానీ నీ మంచితనం తెలిసిన వాడిని కనుకే, నీవు ప్రత్యక్షంగా బాధ్యుడవు కాదు కనుకే నీకీ సహాయం చేయాలనుకుంటున్నాను. నేను చెప్పినట్లు రాసెయ్యి" అన్నాడు మస్తాన్‌రావు.

రాంసింగ్ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. రెండు చేతులూ ఎత్తి నమస్కారం పెడ్తూ "సాబ్ మీ అందరి అభిమానానికీ నేనెంతో కృతజ్ఞుడిని. కాని నేను అబద్ధం స్టేట్‌మెంట్ ఇయ్యలేను" అన్నాడు.

"ఇయ్యకపోతే నీ ఉద్యోగం పోతుంది" గుర్తు చేశాడు మస్తాన్‌రావు.

"సాబ్ .... మీకు తెలుసు మేము గూర్ఖాలం అని. ఎక్కడో నేపాల్ నుండి ఇంత దూరం వచ్చాం. మేము అబద్ధం ఆడమనీ, నీతికి నిలబడతామనీ, నమ్మకంగా పనిచేస్తామనే కదా సాబ్ మాకు మీరు ఈ చౌకీదార్ పని ఇచ్చింది! బ్రిటిష్ కాలంనుంచి ఇప్పటివరకు కూడా సైన్యంలో మాకు గూర్ఖా రెజిమెంట్ అనే ప్రత్యేకమైన దళం వుంది. ఇది నమ్మకానికి పెట్టింది పేరు.

అసలు గూర్ఖా అంటేనే మాట తప్పని మంచితనానికి పర్యాయపదంగా చలామణీ అవుతోంది. అటువంటిది నా ఉద్యోగం కోసం నేను అబద్ధం ఆడితే అది మొత్తం మా జాతికే కళంకం సాబ్. ఆపని నేను చేయలేను" అన్నాడు రాంసింగ్ దృఢంగా.

"అది నిజమేనయ్యా. కాని ఇదేమీ నువ్వు కావాలని చేసింది కాదుగా. పైగా ఈ విషయం ఇంకోరికి తెలిసే ప్రసక్తే లేదు" అన్నాడు మస్తాన్‌రావు.

"తెలిసి ముట్టుకున్నా, తెలియక ముట్టుకున్నా నిప్పు కాలుతుందికదా సాబ్. ఈ విషయం ఇతరులకి తెలియకపోయినా నా మనసుని చిత్రవధ చేస్తూనే వుంటుంది. అంతకంటే ఉద్యోగం పోవడానికే నేను ఇష్టపడ్తాను" అన్నాడు రాంసింగ్ ధీరోదాత్తతతో.

"సరే. ఇంక నేను చెప్పగలిగింది లేదు. నీకు ఉద్యోగం పోవడం ఖాయం. ఉన్న సాక్ష్యం బట్టి నేను దానిని ఆపలేను. కాని నునే చేయగలిగింది ఒక్కటే. నిన్ను కంపల్సరీగా రిటైర్ చేస్తా. అందువల్ల నీకు పెన్షన్ వస్తుంది. వేరే ఉద్యోగం ఏదైనా చేసుకోవచ్చు. నీకు అనువైన ఉద్యోగం చూడడానికి వీలైతే ప్రయత్నిస్తా" అన్నాడు మస్తాన్‌రావు.

"మీ ఇష్టం. మీ ధర్మం మీరు నిర్వర్తించండి సాబ్. నాకు సహాయం చేయడానికి మీ డ్యూటీకి భంగం రానీకండి" అన్నాడు రాంసింగ్.

"సరే. నువ్వు ఇంక వెళ్ళవచ్చు. నీ స్టేట్‌మెంట్ తర్వాత తీసుకుంటాను" అన్నాడు మస్తాన్‌రావు.

రాంసింగ్ నమస్కారం పెట్టి వెళ్ళిపోయాడు. అతను వెళ్తుంటే తనక్రింద పనిచేసే చౌకీదార్ రాంసింగ్ అని అనిపించలేదు. ఒక అత్యున్నతమైన వ్యక్తిలాగా అనిపించింది.

*(స్వాతి మాసపత్రిక, ఫిబ్రవరి 1994)*